క్లుప్తంగా

సమస్యలపై వినతుల స్వీకరణ



కార్యాలయానికి వచ్చినవారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: నియోజకవర్గంలో ప్రతి గ్రామంలోనూ అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతుల కల్పన జరగాలని, ఇతర ఎటువంటి ఇబ్బందికర పరిస్థితులు తలెత్తకూడదని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజకవర్గంలో నాలుగు మండలాల నుంచి వివిధ సమస్యలపై వివరించి వినతిపత్రాలు అందజేశారు. సమస్యలను పరిష్కారం నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు ఎమ్మెల్యే సిఫార్సు చేశారు.

యలమర్తి కుటుంబానికి ఎమ్మెల్యే కొఠారు పరామర్శ

పెరుగ్గూడెంలో ఇటీవల మృతి చెందిన యలమర్తి సోమబ్రహ్మం చిత్రపటానికి ఆదివారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు, యలమర్తి కుటుంబ సభ్యులున్నారు.

పుస్తక పఠనంతో ఉత్తమ ఫలితాలు



భీమడోలు శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న చిన్నారులు

భీమడోలు: పుస్తక పఠనంతో ఉత్తమ ఫలితాలు సాధించి విజేతలుగా నిలవ వచ్చని వక్తలు కొనియాడారు. మండలంలోని భీమడోలు శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని పుస్తక పఠనం చేసారు. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలకు చెందిన బాలబాలికలు పాల్గొని సామూహిక పుస్తక పఠనం చేసారు. చిన్నారులు కథలు, జీవిత చరిత్రలు, దినపత్రికలు చదివారు. ఈ కార్యక్రమంలో పెద్దలు మోహనరావు, కడగల సత్యనారాయణ, పాఠకులు, చిన్నారులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

పెదపాడు: అనారోగ్యంతోపాటు ఇటీవల కొన్న ట్రాక్టర్ లాభసాటిగా లేకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఓవ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పెదపాడు మండలంలోని కలపర్రులో చోటుచేసుకుంది. పెదపాడు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం పెదపాడు మండలంలోని కలపర్రుకి చెందిన కుప్పాల సంతోష్‌కుమార్ (38) ఇటీవల ట్రాక్టరు కొని అద్దెకు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతూ ట్రాక్టర్ సక్రమంగా నడపలేకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో సంతోష్‌ను కుటుంబ సభ్యులు మందలించారు. తీవ్ర మనస్తాపానికి గురైన సంతోష్ శనివారం సాయంత్రం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి వైద్యం నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు. భార్య అరుణకుమారి ఫిర్యాదు మేరకు పెదపాడు ఎస్సై చల్లా కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోదీ పాలనలోనే దేశాభివృద్ధి

ఏలూరు రూరల్: నరేంద్రమోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లోపై అభివృద్ధి బాట పట్టిందని బీజేపీ గోదావరి జోనల ఇన్‌చార్జి గారపాటి సీతారామాంజనేయచౌదరి అన్నారు. ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో ఏలూరులో నిర్వహించిన కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనపై మేధావులు సదస్సులో ఆయన మాట్లాడారు. మోదీ చేపట్టిన జనధన్ బ్యాంక్ ఖాతాలు, ముద్ర రుణాలు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, స్వచ్ఛభారత్‌తో పాటు జాతీయ రహదారులు నిర్మాణం, విమానాశ్రయాల అభివృద్ధి వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో వెలుగు నింపాయన్నారు.

రోడ్డు ప్రమాదంలో మోటారుసైక్లిస్టుకు గాయాలు

ఉంగుటూరు: బాదంపూడి వద్ద ఎస్ మలుపులో అదుపు తప్పడంతో మోటార్‌సైక్లిస్టు కింద పడిపోయాడు, తలకు రోడ్డు దెబ్బతగలడంతో తీవ్ర రక్తస్రావం అయ్యింది. కైకరం గ్రామానికి చెందిన కాశీ ముత్యాలమ్మతల్లి ఆలయం వద్ద తన సోదరులు ఏర్పాటు చేసిన భోజన కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చాడు. ఆ క్రమంలో కాశీ కైకరం నుంచి ఆలయం వైపు వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. తీవ్రగాయాలైన కాశీని తొలుత తాడేపల్లిగూడెం, అక్కడి నుంచి ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రుతుపవనాల రాక.. విస్తారంగా వర్షాలు



భీమడోలులో ఏపుగా పెరిగిన నారుమడి



రైతులకు సూచనలందిస్తున్న ఏడీఏ, ఏవోలు

- జోరుగా నారుమడులు
- రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

భీమడోలు: ఈశాన్య రుతుపవనాల రాకతో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వ సహకారంతో రైతులు పంటల సాగుకు సమాయత్తమవుతున్నారు. గ్రామాల్లో రైతులు జోరుగా నారుమడులు వేస్తున్నారు. ఉంగుటూరు నియోజకవర్గ వ్యాప్తంగా 50వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండలాల్లో 2,500 ఎకరాల్లో వరి నారుమడులు వేయాల్సిన ఉండగా ఇప్పటివరకు 60శాతం మాత్రమే నారుమడులు వేసారు. జూలై మొదటి వారానికి నాట్లు పూర్తి చేయాలని అధికారులు అంటున్నారు. ప్రభు త్వం రైతులు పెట్టుబడి సాయాన్ని సకాలంలో వారి ఖాతాల్లో జమ చేయడం, దాళ్వా సాగులో ధాన్యం కొనుగోలు సొమ్మును సైతం 21 రోజుల లోపుగా జమ చేయడం ద్వారా రైతులు ఆనందోత్సాహాలను వ్యక్తం చేస్తున్నారు. కౌలు దారులంతా సాగు హక్కు పత్రాలను పొందాలని, ఈ పంటల నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని సంబంధిత అధికారులు రైతులను కోరుతున్నారు. భీమడోలు మండలంలో 13,250 ఎకరాలకు 700 ఎకరాల్లో వరి నారుమడి వేయాల్సి ఉండగా 440 ఎకరాల్లో నారుమడులు పూర్తయ్యాయని ఏవో ఎస్‌పీవీ ఉషారాణి తెలిపారు. వర్షాల నేపథ్యంలో వరి నారుమడులు నష్టపోకుండా రైతులకు ఏడీఏ పి.ఉషారాజకుమారి సూచనలందిస్తున్నారు. వర్షం నీరు పంట పొలాల్లో లేకుండా ఎప్పటికప్పుడు బయటకు పోయేలా రైతులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. 5 సెంట్ల నారుమడిలో రెండు కిలోల నత్రజని, కిలో చొప్పున భాస్వరం, పొటాష్ ఎరువులు వేసుకోవాలని సూచిస్తున్నారు.

ఖరీఫ్ సీజను పనులు ప్రారంభం

ఉంగుటూరు: ఖరీఫ్ పంట కాలం ప్రారంభం కావడంతో ఆయకట్టు పొలాల్లో వ్యవసాయ పనులు సందడి ప్రారంభమయ్యాయి. తొలి దశలో రైతులు నారుమళ్లు బాగుచేయడం, దమ్ములు చేయడం, విత్తనాలు ఎంపిక, విత్తనాలు వెదజల్లడం వంటి పనులు చేస్తున్నారు. మండల వ్యవసాయ అధికారి బాలిన వెంకటేష్ ఈ సందర్భంగా రైతులకు కొన్ని సూచనలు చేస్తున్నారు. నారుమడిలో అనుసరించాల్సిన విధానాలపైన కొన్ని విషయాలు తెలియజేశారు.

77,166 జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ

దెందులూరు: దెందులూరు మండలంలో 77,166 మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు ఇచ్చామని దెందులూరు మండల విద్యాశాఖాధికారి-1 సీహెచ్ బుద్ధవ్యాస్ అన్నారు. ఎంఈఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలంలో 74 పాఠశాలల్లో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, పేరెంట్ కమిటీ సమన్వయం, ప్రణాళికతో విద్యార్థులకు సకాలంలో పాఠశాల తెరిచిన 10 రోజులలోపే పంపిణీ పూర్తి చేయడం విశేషమన్నారు. ఆలస్యం కాకుండా విద్యార్థులకు అసౌకర్యం లేకుండా ప్రభుత్వం పంపిణీ చేసిన 77,166 జగనన్న విద్యాకానుక కిట్లు అందజేసిన అందరినీ ఎంఈఓ అభినందించారు.

2వేల కౌలు రైతుల కార్డుల పంపిణీ

దెందులూరు: మండలంలో 17 పంచాయతీల్లో ఇప్పటి వరకు 2 వేల కౌలురైతుల కార్డులు అందజేస్తామని దెందులూరు మండల వ్యవసాయ శాఖాధికారి గద్దె రమేష్ బాబు అన్నారు. ఆదివారం రైతు భరోసా కేంద్రంలో కౌలు రైతుల కార్డుల మంజూరు ప్రక్రియలో ఆయన మాట్లాడుతూ దెందులూరు మండలానికి 3,200 కౌలు రైతుల కార్డుల పంపిణీ లక్ష్యాన్ని ఇచ్చారన్నారు. ఇంకా 1,200 మంది రైతుల త్వరితగతిన తీసుకోవాలని ఆయనకోరారు. అన్ని గ్రామాల్లో రైతుభరోసా కేంద్రాల్లో రైతులు విత్తనాలను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుని తీసుకోవాలని సూచించారు.

జలకళ బోరు ప్రారంభోత్సవం



రామారావుగూడెం పంచాయతీలో జలకళ బోరును ప్రారంభోత్సవం చేస్తున్న కామిరెడ్డి నాని తదితరులు

దెందులూరు: వైఎస్సార్ జలకళ పథకం రైతులందరికీ వరమని, రైతును రాజుగా చూడాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. ఆదివారం సర్పంచ్ పర్వతనేని శ్రావణి సుధీర్ ఆధ్వర్యంలో రామారావుగూడెం పంచాయతీలో రైతులు కందుల దుర్గారావు, రాధాకృష్ణ, గంగరాజు పొలంలో వైఎస్సార్ జలకళ పథకంలో నిర్మించిన నూతన బోరును కామిరెడ్డి నాని ప్రారంభోత్సవం చేశారు. రైతులు రాధాకృష్ణ, గంగరాజు, దుర్గారావు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పర్వతనేని వెంకట్రాజు, ఎంపీటీసీ కాలి ఇశ్రాయేలు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు పర్వతనేని నరేంద్ర, నాయకులు తేరం ప్రసాద్, పీ. బాజీ, పిల్లా ప్రసాద్ తదితరులున్నారు.

సీఎం జగన్ అభిమాని మోటారుసైకిల్ యాత్ర



రాజును అభినందిస్తున్న సచివాలయాల మండల కన్వీనర్ కట్టా ఏసుబాబు, వైఎస్సార్ సీపీ కార్యకర్త నాయుడు గణపతి

దెందులూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి మరోసారి ముఖ్యమంత్రి కావాలని నెల్లూరు జిల్లా జలగంటి మండలం అన్నవరం గ్రామస్తులు వైఎస్ జగన్ అభిమాని అడవికొట్టు రాజు అన్నారు. ఆదివారం నెల్లూరు జిల్లా నుంచి మోటారుసైకిల్‌పై పార్టీ జెండాను పెట్టుకుని దెందులూరు మీదుగా వెళ్తున్న రాజును శ్రీ వేంకటేశ్వర ఆటో యూనియన్ అధ్యక్షుడు కొత్తపల్లి ఫణి కుమార్ పలకరించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత నెల 14 నుంచి మోటారుసైకిల్ యాత్ర చేస్తున్నానని ఇప్పటి వరకు 102 నియోజకవర్గాలు యాత్ర చేశానన్నారు. 103వ నియోజకవర్గంగా దెందులూరు వచ్చానని చెప్పారు. ఫణికుమార్‌తోపాటు మండల సచివాలయ కన్వీనర్ కట్టా ఏసుబాబు, నాయుడు గణపతి తదితరులు రాజును కలిశారు. దెందులూరు బస్టాండ్ సెంటర్‌లో దివంగత వైఎస్సార్ విగ్రహానికి రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజు చేస్తున్న యాత్రను ఏసుబాబు, గణపతి అభినందించి వసతి, భోజన సదుపాయాలు కల్పించారు.

సాహిత్యం ద్వారా సమాజ చైతన్యం



సాహితీ సంస్థ రజతోత్సవ వేడుకలో మాట్లాడుతున్న కవయిత్రి భమిడిపాటి

గణపవరం: సాహిత్యం ద్వారా సమాజాన్ని చైతన్యపరచి, మేల్కొలిపే విధంగా ఉండాలని ప్రముఖ ఆధ్యాత్మిక, సాహితీవేత్త, కృష్ణా జిల్లా రచయితల సంఘం కార్యదర్శి భమిడిపాటి బాలత్రిపురసుందరి అన్నారు. ఆదివారం గణపవరం కేవీపీ పంక్షన్ హాలులో ప్రముఖ ఆగమ, ఆధ్యాత్మిక సాహితీ సంస్థ శ్రీవిష్ణు సాయి జ్ఞానజ్యోతి సంస్థ రజతోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో త్రిపురసుందరి మాట్లాడుతూ రాసిన కవిత్వాన్ని పదే పదే చదివితే మనం ఎన్నిసార్లు చదువుతామో అన్ని విజయాలు సొంతం చేసుకోవచ్చునన్నారు. ఏ విషయాన్నైనా ముందుగా గురువు ఆచరించి, దానినే శిష్యులకు బోధించాలన్నారు. మహిళలు సమాజంలో ఒక భాగమని అన్నారు. ఈ సందర్భంగా పలువురు కవులను, సాహితీ వేత్తలను సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. కవి సమ్మేళనాలు నిర్వహించారు. 2022వ సంవత్సరం కవితల పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. 25 సంవత్సరాల కార్యక్రమాల నివేదికలను చదివి వినిపించారు. జ్ఞానజ్యోతి సంస్థకు అండగా నిలిచిన 25 మంది దంపతులను సత్కరించారు. సాహితీ ప్రముఖులు పెద్దింటి కిరణ్‌కుమార్, చక్రవర్తుల సుబ్బారావు, పల్లిపట్టు నాగరాజు పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథ రథయాత్ర

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అంతర్జాయతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో ఆదివారం ఏలూరు నగరంలో జగన్నథ రథయాత్ర వైభవంగా నిర్వహించారు. సాయంత్రం 3.30 గంటలకు స్థానిక రామకోటి ప్రాంగణం నుంచి ప్రారంభమైన యాత్ర మెయిన్ బజారు, పవర్‌పేట, జీఎన్‌టీ రోడ్డు, రామచంద్రరావు పేట, శాతవాహన నగర్‌ల మీదుగా లయన్స్ కల్యాణ మండపం వరకు వెళ్లింది. సాయంత్రం 7.30 గంటల నుంచి స్థానిక శాతవాహన నగర్‌లోని లయన్స్ క్లబ్ కల్యాణ మండపంలో జగన్నాథ స్వామికి పుష్పాభిషేకం, చప్పన్ భోగ కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పూజ్య లీలా పరాయణ ప్రభు జగన్నాథుని లీలపై ప్రవచం చేశారు. ఈ సందర్భంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమాలను ఇస్కాన్ ఏలూరు శాఖ మేనేజర్ రాధా వల్లభ దాస్ పర్యవేక్షించారు.

ప్రారంభానికి సిద్ధంగా ప్రభుత్వ భవనాలు





ఎంఎంపురంలో ప్రారంభానికి సిద్ధమైన గ్రామ సచివాలయం, వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ భవనం

- 27న ప్రారంభోత్సవం చేయనున్న ఎమ్మెల్యే వాసుబాబు
- రూ.61.80 లక్షలతో రెండు భవనాలు నిర్మాణం

భీమడోలు: పూళ్ల పంచాయతీ శివారు ఎంఎంపురంలో గ్రామ సచివాలయం-3, వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ భవనం (ఆర్‌బీకే)లు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. సచివాలయ నిర్మాణానికి రూ.40లక్షలు, ఆర్‌బీకే నిర్మాణానికి రూ.21.80లక్షలతో నిర్మించి ఈ భవనాలను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. ఈనెల 27వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు చేతుల మీదుగా ఈ భవనాలను ప్రారంభించేందుకు అధికారులు తగు ఏర్పాటు చేస్తున్నారు. గ్రామానికి చెందిన డాక్టర్ పుప్పాల గోవర్ధన రామనుజం, వారి కుటుంబ సభ్యులు 20 సెంట్ల స్థలాన్ని దానం చేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. దీనితో గ్రామంలో నూతన భవన నిర్మాణ పనులు శరవేగంగా జరిగాయి. గ్రామ ప్రజలు, రైతులకు అందుబాటులోకి రానున్నాయి. ఉంగుటూరు నియోజవర్గంలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ భవనాల నిర్మాణాల విషయంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా కొత్త భవనాలను నిర్మించారు. వాసుబాబు స్వగ్రామం ఎంఎంపురంలోని వారి కుటుంబ సభ్యులు విద్యావేత్త డాక్టర్ పుప్పాల గోవర్ధన రామానుజంతో పాటు వారి కుటుంబ సభ్యులతో చర్చించి ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు స్థలం కేటాయించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలందించాలన్న ఏకైక లక్ష్యంగా గ్రామంలోని గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసారు. ప్రతి గ్రామంలో రూ.60 నుంచి 80లక్షలతో కొత్త భవనాలను నిర్మించారు. జూలై 1 నుంచి మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు సేవలందించేందుకు వారితో మాట్లాడేందుకు సచివాలయాలు వేదికలు కానున్నాయి. ఈ నేపథ్యంలో ఈ భవనాలు నిర్మించడంతో ప్రజలంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. స్థల దాతలను గ్రామస్తులు అభినందిస్తున్నారు.

విద్య, వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు

ఏలూరు టౌన్: దేశానికే ఆదర్శవంతమైన పాలన అందిస్తూ.. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆదివారం 104వ రోజు ఏలూరు 47వ డివిజన్ తంగెళ్లమూడి వంతెన సమీపంలోని నెహర్ మసీదు పోస్టాఫీస్ సమీపం నుంచి ఆయన పాదయాత్ర నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా? సమస్యలు ఉన్నాయా? అంటూ ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ పేదలకు విద్య, వైద్యాన్ని ఉచితంగా మరింత చేరువ చేయాలనే ఆకాంక్షతో సీఎం జగన్ ఆయా రంగాల్లో వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తున్నారని చెప్పారు. నేడు ప్రభుత్వ పాఠశాలల్లో నోసీట్స్ బోర్డులు వెలిసే స్థాయికి చేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రభుత్వ బడుల్లోని టెన్త్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి సత్తా చాటుకున్నారని వివరించారు. పేదలు ఆధునిక వైద్యానికి దూరం కాకూడదనే ఉన్నతాశయంతో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత విస్తృతం చేశారని, 108, 104 వాహనాలు, ఫ్యామిలీ డాక్టర్, వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్, వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్స్, మెడికల్ కాలేజీల ఏర్పాటుతో అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. తొలుత ఏలూరు నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, ఏలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ నెరుసు చిరంజీవి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికారు.

మానవత సేవలు మరింత విస్తృతం



సిద్ధాపురంలో సమావేశంలో మాట్లాడుతున్న నౌడు అచ్యుతరామారావు

నిడమర్రు: మానవత స్వచ్ఛంద సంస్థ సేవలు గ్రామాల్లో మరింత విస్తృతం చేసేలా క్షేత్రస్థాయిలో ఉన్న సభ్యులు కృషి చెయ్యాలని ఆ సంస్థ మండల అధ్యక్షుడు నౌడు వెంకట అచ్యుతరామారావు అన్నారు. సిద్ధాపురం మాజీ సర్పంచ్ నౌడు జానకిలక్ష్మి నివాసంలో మండల మానవత సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన రీజనల్ చైర్మన్ సంకు సత్యకుమార్ మాట్లాడుతూ మండలంలో 14 ఫ్రీజర్లు అందుబాటులో ఉన్నాయని వాటిలో మరమ్మతులు ఉంటే తక్షణం చేయించాలన్నారు. మానవత సేవలు ప్రజల్లోకి తీసుకుని వెళ్లి గత ఏడాది కంటే ఈ సంవత్సరం సభ్యత్వాల సంఖ్యను పెంచాలని నూతన కమిటీకి సూచించారు. అనంతరం భవిష్యత్ కార్యాచరణపై పలు తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో కోశాధికారి కాన్వెంట్ శ్రీను, జాయింట్ కార్యదర్శి సంకు కొండలరావునాయుడు, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు పుప్పాల మెహర్‌కుమార్, ఎంపీటీసీ కొత్తల సింహాచలం, ముత్యాల చిన సత్యనారాయణ, విశ్వనాధరాజు, ఎంసీహెచ్ అప్పారావు తదితరులున్నారు.

ఫొటో, వీడియోగ్రాఫర్ల కార్యవర్గం ప్రమాణ స్వీకారం



ఫొటో, వీడియోగ్రాఫర్ల కార్యవర్గ సభ్యులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఫొటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం ఏలూరు జిల్లా నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం నగరంలోని కర్ణభక్తుల సంక్షేమ సంఘ భవనంలో నిర్వహించారు. ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా అమీర్ బాషా, కార్యదర్శిగా కేవీ రమణారావు (చిన్ని), కోశాధికారిగా పీవీఆర్ మూర్తి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వై.సూరిబాబు, పీఆర్‌ఓగా ప్రదీప్ కుమార్, కన్వీనర్, కుటుంబ భరోసా ఇన్‌చార్జిగా ఎస్ ఎన్‌డీ ప్రసాద్ ప్రమాణస్వీకారం చేశారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు

- లబ్ధిదారులకు నేరుగా పథకాల లబ్ధి
- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి
- ఏపూరులో గడపగడపకు మన ప్రభుత్వం



ఏపూరులో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, చిత్రంలో జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ

పెదపాడు: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తూ, ప్రజలకు నేరుగా లబ్ధి అందిస్తోందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తెలిపారు. పెదపాడు మండలంలోని ఏపూరులో 9వరోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యేపై పూలు చల్లి, మంగళ హారతులతో గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో భాగంగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ తిరిగి వారికి ప్రభుత్వం అందిస్తున్న ప్రభుత్వ కార్యక్రమాలను, పథకాలను వివరించారు. అనంతరం ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గడపగడపకు మన ప్రభుత్వంలో వస్తున్న సమస్యలను వీలైనంత త్వరలో పరిష్కరించాలని, తద్వారా ప్రజలకు మేలు జరిగేలా చూడాలని తెలిపారు. గ్రామంలో 10 ఎకరాలు కొని ఇళ్ల స్థలాలు అందించామన్నారు. ఇంకా స్థలం సేకరించి ప్రజలకు అందించాల్సిన అవసరముందని చెప్పారు. ఎవరికి ఏ పథకం అందించాలన్నా వలంటీరు ద్వారా వివరాలు తెలుసుకుని దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రామంలో ఇళ్ల స్థలాలు, పింఛన్లు అందించాలని దరఖాస్తు చేసిన వారికి న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని సూచించారు. ఫిర్యాదులు పరిష్కారానికి కృషి చేయాలని అన్నిశాఖల అధికారులను ఆదేశించారు. ఒకే ఇంట్లో భర్తకు పింఛను వచ్చినప్పటికీ పక్షవాతానికి గురైన వ్యక్తి రెండో పింఛను కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం నుండే నేరుగా పింఛను అందుకునే అవకాశం ఉందని సూచించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకాన్ని పెదపాడు మండలంలో సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాదరదావు, పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి ఏసురాజు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, గోగుంట సొసైటీ అధ్యక్షుడు భావరాజు సత్యనారాయణ, దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, ఏపూరు గ్రామ సర్పంచ్ చోడగిరి రామకృష్ణ, ఎంపీటీసీలు నాగమల్లేశ్వరావు, శిరీషా, బెజవాడ సత్యనారాయణ, బెజవాడ శేఖర్, బెజవాడ నర్సింహరావు, కొత్తూరు విమలారావు, ముంగర రమేష్, తినాతి విజయ్, తహసీల్దార్ జీ విజయ్ కుమార్ రాజు ఎంపీడీఓ నిర్మలజ్యోతి, వ్యవసాయ అధికారి ప్రదీప్‌కుమార్, ఏపీఎం సుమలత పాల్గొన్నారు.